అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 14 ఆగస్టు 2023

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-వేమనపల్లి



అభివృద్ధి పనులలో భాగంగా వేమనపల్లి మండల కేంద్రంలోని బస్ స్టాండ్ ప్రాంతంలో రూ.35 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎంపీపీ కోళి స్వర్ణలత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోళి వేణుమాదవ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుబిడే మధుకర్, సహకార సంఘ చైర్మన్ కుబిడే వెంకటేష్, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు ముజ్జు, నీల్వాయి మాజీ సర్పంచ్ రుద్రభట్ల లక్ష్మీనారాయణ, వేమనపల్లి ఉపసర్పంచ్ గుమ్ముల సత్యం, నాయకులు పురాణం లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

నూతన సీఐ, ఎస్సైకి సన్మానించినం

నవతెలంగాణ-జైనూర్



నూతనంగా బాధ్యతలు చేపట్టిన జైనూర్ సీఐ మల్లేష్, ఎస్సై సందీప్‌ను జమాకె ఓలమాయేహింద్ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జమాతె ఓలమాయేహింద్ మండల అధ్యక్షుడు సయ్యద్ మునీర్ ఇషాతి మాట్లాడుతూ మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. మండలంలోని ప్రజలకు మరిన్ని చట్టాలపై అవగాహన కల్పిస్తూ రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మౌలాన, జబ్బార్, ఇషాతి, హైమద్ మౌలాన, మౌలాన మెహ్రాజ్, ఆసిస్ ఎక్బాల్, ఆసిస్ రౌఫ్ పాల్గొన్నారు.

పరిహారం పరిహాసమేనా..?

పంటలు పండిస్తూ నలుగురికి అన్నం పెట్టే అన్నదాతలను ఆర్థిక కష్టాలు వీడటం లేదు. పంట కోసం చేసిన అప్పులు తీరడం లేదు. ఆపద కాలంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేయడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఇటీవల అధిక వర్షాలకు నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చడంతో పంటలను ముంచెత్తాయి. ఎదుగుతున్న క్రమంలో పంటలన్ని వరదపాలయ్యాయి. దీంతో పంట కోసం వెచ్చించిన పెట్టుబడితో పాటు రానున్న మళ్లీ పంటలు కూడా వేసుకోలేని పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో కష్టాల్లో ఉన్న రైతులకు పరిహారం అందించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం సర్వేకు కూడా ఆదేశాలు జారీ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఆదేశాలు రాలేదనే కారణంగా వ్యవసాయ అధికారులు కూడా నష్టం జరిగిన పంటల వైపు వెళ్లలేదు. కేవలం వేలల్లో పంట నష్టం జరిగిందని అంచనా వేసి చేతులు దులుపుకొన్నారు. ఫలితంగా అన్నదాతలకు ప్రభుత్వ పరిహారం పరిహాసంగానే మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

- వరదలతో తీవ్రంగా నష్టపోయిన పంటలు
- సర్వేకు అధికారికంగా ఆదేశాలివ్వని ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పరిశీలించని వ్యవసాయ అధికారులు
- ఆర్థిక నష్టంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



జైనథ్ మండలంలో నీట మునిగిన పంటలు (ఫైల్)

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అధిక వర్షాలు అన్నదాతలను ఆగమాగం చేశాయి. కురవాల్సిన వర్షపాతం కంటే అధికంగా నమోదు కావడంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా, ప్రాణహిత, గోదావరి నదులతో పాటు వాగులు, వంకలు పొంగి పొర్లడంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలను వరదలు ముంచెత్తాయి. పలు చోట్ల చెరువులకు గండి పడి పచ్చని పంటలన్ని కొట్టుకుపోయాయి. పొలాలను ఇసుక మేటలు, బురద కమ్మేసింది. మళ్లీ పంటలు వేసే పరిస్థితి లేకుండా పొలాలన్ని రాళ్ళు రప్పలతో అస్తవ్యస్తంగా మారాయి. పొలాల దుస్థితిని చూసి అన్నదాతలు లబోదిబోమన్నారు. పంట కోసం పెట్టుబడి మొత్త నీటిలో కలిసిపోయిందని కన్నీరు కార్చారు. ఎకరానికి సుమారు రూ.30వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరివాహక ప్రాంతాల్లోని ఒక్కో రైతుకు సంబంధించి 5 నుంచి 10 ఎకరాల వరకు నష్టం జరగడంతో తీవ్ర ఆర్థిక నష్టాలను చవిచూశారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కౌలు డబ్బులతో పాటు పంట కోసం చేసిన పెట్టుబడి మొత్తం వరద పాలు కావడంతో వారి బాధ వర్ణణాతీతంగా మారింది. ఇలాంటి ఆపద సమయంలో ఆదుకోవాల్సిన ప్రభుత్వం కేవలం ఓదార్పునకే పరిమితమైందని రైతుల నుంచి విమర్శలు ఎదుర్కొంటోంది.

పరిహారానికి భరోసా కరువు..!

వరదలతో పంటలు నష్టం జరిగి ఆవేదనలతో రైతులకు ప్రభుత్వం భరోసా లేకుండా పోయింది. కనీసం పంటల సర్వేకు కూడా అధికారికంగా ఆదేశాలు జారీ చేయకపోవడంతో వ్యవసాయశాఖ అధికారులు ఎటూ కదలడం లేదు. వరదలు వచ్చిన సమయంలో కొన్ని ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు పంట నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేశారు. ఆదిలాబాద్ జిల్లాలో 60వేల ఎకరాలు, నిర్మల్ జిల్లాలో 39వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అంచనా వేశారు. కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని చెబుతున్నారు. కానీ ఈ నష్టానికి పరిహారం రావడం అనుమానంగా మారింది. గత మూడేండ్ల నుంచి ఫసల్ బీమా సౌకర్యం లేకపోవడం..వరదలు సంభవించి నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం పరిహారం మాటెత్తకపోవడం వంటి పరిణామాలు రైతులను తీవ్రంగా కలిచివేస్తున్నాయి. కిందటి యాసంగిలో వడగండ్ల వర్షాలతో రెండు దఫాలుగా పంటలు నష్టపోయినప్పటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిహారం అందించలేదని రైతులు చెబుతున్నారు. ఒకే దఫా పరిహారం అందించి రెండో దఫా నష్టాన్ని అలాగే వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి కష్టాలు మరిచిపోకముందే ఖరీఫ్‌లోనూ అన్నదాతలను పంట నష్టం వెంటాడటం తీవ్ర ఆర్థిక కష్టాలను మిగిల్చింది.

ప్రభుత్వం పరిహారం అందించాలి

కొడిచెర్ల అడెల్లు, బహదూర్‌పూర్, జైనథ్ మండలం



ఐదు ఎకరాల్లో పత్తి పంట వేశాను. అధిక వర్షాల కారణంగా పెన్‌గంగా నది ఉగ్రరూపం దాల్చడంతో మూడు ఎకరాల వరకు పంట కొట్టుకుపోయింది. ఎకరానికి సుమారు రూ.20వేల వరకు ఖర్చు చేయగా రూ.60వేల వరకు నష్టం జరిగింది. పంట వరద పాలు కావడంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

ప్రభుత్వం పంటల సర్వే చేయించాలి

బండి దత్తాత్రి, అఖిలపక్ష రైతు సంఘం నాయకుడు



ఇటీవల కురిసిన అధిక వర్షాలతో నదులు, వాగులు సమీపంలోని పంట పొలాలన్నింటిని వరదలు ముంచెత్తాయి. పరివాహక ప్రాంతాల్లోని పంటలన్ని తీవ్రంగా నష్టపోయాయి. మళ్లీ పంటలు వేసే పరిస్థితి కూడా లేదు. అన్నదాతలను తీవ్ర ఆర్థిక నష్టాలను గురిచేశాయి. ప్రభుత్వం వెంటనే అధికారికంగా పంటల సర్వే చేయించి ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలి.

ఆదివాసీ కాలనీకి సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలోని ముల్కలపేట గ్రామంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన ఇప్పటివరకు ఆదివాసి బ్రతుకులు మారలేదని అన్నారు. ముల్కలపేట ఆదివాసి కాలనీకి సరైన రోడ్డు సౌకర్యం కూడా లేదని అన్నారు. వర్షాకాలంలో ఆదివాసీల పరిస్థితి మరి దారుణంగా ఉంటుంది, కొద్దిపాటి వర్షం పడితే మత్తడి పొంగి ఆదివాసీలు ఎటు బయటకు వెళ్ళలేని దుస్థితి ఉందని అన్నారు. ఆదివాసీలు కనీస అవసరాల కోసం గ్రామంలోకి వెళ్లాలంటే మత్తడి దాటాల్సిందేనని మెయిన్ రోడ్డు నుండి ఆదివాసి కాలనీ వరకు సుమారు ఒక కిలోమీటర్ ఉన్న రోడ్డు కూడా సక్కగా లేకపోగ వర్షాకాలంలో పూర్తిగా బురుదమయమై ప్రజల రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి మెయిన్ రోడ్ నుండి ఆదివాసీ కాలనీ వరకు సీసీ రోడ్, చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణం చేసి ఇక్కడి ఆదివాసులకు రవాణా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల రాబోయే రోజులలో ఆందోళన చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆత్రం శ్రావణ్, జిల్లా నాయకులు ఉంద్రాళ్ల ఎల్లయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజేందర్, గ్రామ కమిటీ కార్యదర్శి మల్లేష్, ఆదివాసి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు నల్లి రాజకుమార్, గణపతి, సమ్మక్క, చిన్నక్క, అమ్మక్క బన్నీ, శేఖర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

హడావుడిగా పూర్తి చేసిన కేజీబీవీ నియామకాలపై సమగ్రమైన విచారణ చేపట్టాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు పురేళ్ల నితీష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు(యూఆర్ఎస్)లో కాంట్రాక్టు పోస్టుల భర్తీ ప్రక్రియలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గురువారం విడుదల చేసిన పరీక్ష ఫలితాలను శుక్రవారం ఉదయం పది గంటలకే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకి రావాలంటూ ఆదేశాలు జారి చేశారని అన్నారు. తుది జాబితాను శనివారం ప్రకటించి ఎంపికైన వారు ఆదివారం సాయంత్రం ఐదు గంటలోపు చేరాలంటూ ఆదేశాలు జారిచేయడం దారుణమని అన్నారు. అభ్యర్థులు ఫలితాలను సరిగ్గా చూసుకోక ముందే రెండు రోజులలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తుండడంపై పలు అనుమానాలకు తావిస్తున్నదని అన్నారు. అభ్యర్థులు ఫలితాలను చూసుకొని అభ్యంతరాలని చెప్పేందుకు సరిపోయే అంత గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ పట్టణంలోని నూర్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి విగ్రహ దాత, మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఆత్రం సక్కు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ధనుంజయ్, ఆలయ కమిటీ సభ్యులు కోట శంకర్, అశోక్ చారి, రఘు, కిష్టయ్య, హరి, రాజు, శంకర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల వద్ద కమిషన్ తీసుకోవడం సిగ్గుచేటు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

దివ్యాంగులకు పింఛన్ చెల్లించే సమయంలో రూ.50 నుండి రూ.100 వరకు కమిషన్ తీసుకోవడం చాలా సిగ్గుచేటని చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజా రమేష్ మండిపడ్డారు. ఆదివారం పట్టణంలోని అమ్మ వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంల ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు పింఛన్ తీసుకునే పోస్ట్ ఆఫీస్ ర్యాంప్ ఎక్కడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడడం ఖాయమని అన్నారు. ఇందిరమ్మ పాలనలో అర్హులైన దివ్యాంగులకు అందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. అర్హులైన దివ్యాంగులకు అందరికీ డబల్ బెడ్ రూమ్ పథకాన్ని వర్తింపజేయాలి కానీ బీఆర్ఎస్ హయంలో వారి అనుచరులకు తప్ప బాధితులకు సంక్షేమ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ వికలాంగుల అధ్యక్షుడు పుట్ట రవి, కార్యదర్శులు జి.శ్రీనివాస్‌రెడ్డి, పోతరవేణి రవికుమార్, చెందర్, బి.వెంకటేష్, లతారాణి, కోశాధికారి అజీజ్ పాషా, జీఎస్ఆర్ మిత్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామానికి చెందిన మేస్రం సాంబయ్య ఆదివారం పొలం పనులకు వెళ్లి వస్తుండగా అతనిపై ఒక్కసారిగా అడవిపంది దాడి చేయడంతో చాతి భాగంలో గాయాలయ్యాయి. బాదితున్ను మండలకేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

తెలంగాణ భవన్‌కు తరలిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

చెన్నూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులతో సుమారు(400)మందితో ఆదివారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో చెన్నూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సోషల్ మీడియా సదస్సు ను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు ఆదివారం ఈ సదస్సుకు తరలి వెళ్లారు. ఈ సదస్సులో రాబోయే ఎన్నికలలో పార్టీ కార్యకలాపాలపై చర్చించడం జరుగుతుందని సోషల్ మీడియా నాయకులు తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- న్యాయం చేయాలంటూ బంధువుల రాస్తారోకో
- సీఐ హామీతో సద్దుమనిగిన ఆందోళన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన మండలంలోని అంకుశపూర్‌లో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుశాపూర్ గ్రామానికి చెందిన పోల్కర్ సుధాకర్(45) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆటో పాయింట్ వద్ద క్రమ పద్ధతిలో ఆటోలను పంపించే పని చేసేవాడు గత శుక్రవారం తోటి ఆటో డ్రైవర్లు సాయి, జహంగీర్‌తో కలిసి రెబ్బెన మండలం కైరిగాం గ్రామంలో మరో ఆటో డ్రైవర్ మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లి తిరిగి వచ్చారు. గుండి రహదారిలో ఉన్న వైన్స్ వద్ద మద్యం సేవించి అక్కడి నుండి చిర్రకుంట రహదారిలోని వైన్స్ వద్ద మద్యం సేవించినట్లు తెలిపారు. అక్కడ నుండి ఆటోలో బయలుదేరిన వీరు ఎటువైపు వెళ్లారో తెలియదని ప్రత్యక్ష సాక్షులు తెలిపినట్లు కుటుంబ సభ్యులు వివరించారు. శనివారం నుండి సుధాకర్ కోసం కుటుంబ సభ్యులు గాలించి ఆదివారం ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సుధాకర్ కనిపించట్లేదంటూ కేసు పెట్టారు. అనంతరం మేకల కాపరులు ఆడ ప్రాజెక్టు వద్ద గుర్తు తెలియని శవం కనిపించినట్లు కుటుంబ సభ్యులకు తెలపడంతో పోలీసులను వెంటబెట్టుకుని ప్రాజెక్టు వద్దకు వెళ్లడంతో సుధాకర్ నీటిలో తెలియాడుతూ కనిపించారు. శవంపై కత్తి గాట్లు ఉండడంతో పాటు కావాలనే చంపినట్లు, బంధువులు గుర్తించినట్లు తెలిపారు. మృతుడికి భార్య సుజాత, ముగ్గురు కూతుళ్లు శిల్ప, సిరి, సీమ ఉన్నారు.

న్యాయం చేయాలంటూ బంధువుల రాస్తారోకో

సుధాకర్‌ను కావాలనే చంపారంటూ నిందితులను వెంటనే అరెస్టు చేసి న్యాయం చేయాలని లేదంటే రోడ్డుపై నుండి లేచేది లేదంటూ మృతుడి బావ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, అన్న కొడుకు టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం, మృతుడి భార్య సుజాత తో పాటు కూతుర్లు బంధువులు మతుడి ఫోటోను పట్టుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దాదాపు గంటపాటు రోడ్డుపై వాహనాలు నిలిపివేశారు. బంధువుల ఆర్తనాధాలతో రోడ్డుపై రోదనలు మిన్నంటాయి. సీఐ జవ్వాజి సురేష్ కలుగజేసుకుని ఆందోళన కారులను సముదాయించారు. నిందితులను పట్టుకొని శిక్ష పడేలా చూస్తానని హామీ ఇవ్వడంతో బాధితులు రాస్తారోకో విరమిచ్చారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

విద్యార్థినుల లైంగిక వేధింపులపై జీసీడీఓ విచారణ

- తాత్కాలిక హెచ్‌ఎంగా మారుబాయి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలకేంద్రంలోని ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పార్తిరామ్ విద్యార్థులను లైంగికంగా వేధిస్తున్నారనే ఆరోపనలపై ఆదివారం జీసీడీఓ శకుంతల, కాగజ్‌నగర్ ఏటీడీఓ కమర్ హుస్సేన్ విచారణ చేపట్టారు. విద్యార్థులను లైంగికంగా, మానసికంగా వేధింపులకు హెచ్‌ఎం పాల్పడుతున్నట్టు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపినట్టు తెలిపారు. హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలను విద్యార్థులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నట్టు తెలిపారు. హెచ్‌ఎంపై వచ్చిన ఆరోపణలపై లిఖితపూర్వకంగా అభిప్రాయాలను సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. బెజ్జూర్ ఆశ్రమ పాఠశాల తాత్కాలిక ప్రధానోపాధ్యాయురాలిగా కుంటలమానేపల్లి ఉపాధ్యాయురాలు మారుబాయిని నియమించినట్టు ఆమె తెలిపారు. ఆమె వెంట ఎస్‌సీఆర్‌పీలు పోచాని, బిక్షమయ్య, వెంకటేశ్ ఉన్నారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తాం : జడ్పీటీసీ పుష్పలత

విద్యార్థులను లైంగిక వేధింపులకు పాల్పడుతున్న హెచ్‌ఎం పార్తిరామ్‌ను సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తామని జడ్పీటీసీ పుష్పలత ఆదివారం తెలిపారు. ఆశ్రమ గిరిజన బాలికల పాఠశాలలో పురుష ఉపాధ్యాయులు ఉండడం పట్ల ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఐటీడీ ప్రాజెక్టు అధికారికి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి హెచ్‌ఎంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొడప సోనేరావుపై దాడి సరికాదు

- కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం శంకర్



నవతెలంగాణ-జైనూర్

తుడుందెబ్బ ఆధ్వర్యంలో కొలాం సంఘం నాయకులైన కొడప సోనేరావుపై చేసిన దాడిని కొలాం సంఘం తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం శంకర్, ప్రధాన కార్యదర్శి ఆత్రం రాజు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని కొమురంభీం చౌరస్తా వద్ద కొలాం సంఘం నాయకులతో కలిసి సుమారు అరగంట పాటు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో జరిగిన సంఘటనకు నిరసనగా రాస్తారోకో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కొలాం సంఘం నాయకుడైన కొడప సోనేరావును తుడుందెబ్బకు చెందిన వారు దాడి చేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొలాం సంఘం నాయకులపై దాడులు చేసిన వారిపై వెంటనే కేసు నమోదుచేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదివాసులైన కొలాం నాయకులపై ఇలా దాడి చేయడాన్ని కొలాం ఆదివాసీ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆదివాసీ కొరకు పోరాటం చేస్తామని, కొలాం ఆదివాసులపైనే దాడులు చేయడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. దాడిపై నైతిక బాధ్యత వహించి రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య తన రాష్ట్ర అధ్యక్ష పదవికి వెంటనే రాజీమానా చేయాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ సంఘానికి రాజకీయంగా వాడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఎంపీ, ఎమ్మెల్యేలు కావడం కోసమే ఇలా దాడులు చేయడం సరైందికాదని అసహనం వ్యక్తం చేశారు. కొలాం సంఘం రాష్ట్ర సంఘాల ఆదేశాల మేరకు మా యొక్క గ్రామాల్లో తుడుందెబ్బను బహిష్కరిస్తున్నామని తెలిపారు. కొలాం నాయకులపై దాడిచేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుడుందెబ్బ కొమురం భీం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆత్రం శంకర్ తమ పదవికి రాజీనామా చేస్తూ కొలాం సంఘం జాతి కోసం మద్దతు తెలుపుతున్నానని బహిరంగంగా ప్రకటించారు. కొలాం సంఘం నాయకులపై తుడుందెబ్బ నాయకులు దాడి చేయడం వల్లనే తాను జిల్లా పదవికి రాజీనామా చేస్తున్నట్టు బహిరంగంగా ప్రకటన చేసి రాజీనామా చేశారు. కొలాం నాయకులకు అన్యాయం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. అనంతరం దాడిచేసిన వారిని వెంటనే శిక్షించాలని, కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొలాం సంఘం జిల్లా కార్యదర్శి సిడాం రాజు, ఆత్రం బాపురావు, జిల్లా నాయకులు మడావి భీంరావు, మడావి ముత్త, సిడాం బాపురావు, ఆత్రం మారు, సిడాం భీంరావు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ పథకంతో యాదవుల ఆర్థిక పరిపుష్టి



నవతెలంగాణ-జన్నారం

బిగొర్రెల పంపిణీ పథకంతో యాదవులు ఆర్థిక పరిపుష్టి చెందుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. ఆదివారం రెండవ విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మురిమడుగు గ్రామంలో లబ్దిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడాతు గొర్రెల పంపిణీ పథకం తరహాలో దేశంలో ఏ రాష్ట్రంలో పథకాలు ప్రవేశ పెట్టలేదన్నారు. రైతు బిడ్డ సీఎంగా ఉండడంతో అన్ని వర్గాల ప్రజల సాధక బాధకాలు ఎరిగిన వ్యక్తిగా బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేసే విధంగా పథకాల రూపకల్పన చేస్తున్నారన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదే గ్రామానికి చెందిన ప్రవీణ్ ఇటివలె అకస్మాత్తుగా ఇంటి పైనుండి కింద పడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలిసి వారి ఇంటికి వెళ్లి పలకరించి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దళితవాడలో పర్యటించి దళిత బంధు పథకం పై అవగాహన కల్పించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు, గుర్రం రాజారాంరెడ్డి సూలువ జనార్ధన్, కోఆప్షన్స్ సభ్యుడు మునావర్ అలీఖాన్, పీఏసీఎస్ చైర్మన్లు నాసాని రాజన్న, శీలం రమేష్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ రియాజుద్దీన్ సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు జాడి గంగాధర్ పాల్గొన్నారు.

అదిలాబాద్ బీసీ కాంగ్రెస్ సభను బహిష్కరించాలి

నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ సభను బీసీ సంఘాల నేతలు బహిష్కరించాలని ఆ సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, కోకన్వీనర్ శ్రీరాముల గంగాధర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన నుంచి కాంగ్రెస్ పార్టీ బీసీలను అణగదొక్కుతున్నారని అన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా బీసీలకు తీరని అన్యాయం చేశారన్నారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచిన బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించకుండా, విద్య ఉద్యోగాల్లో కూడా 1992 వరకు రిజర్వేషన్లు కల్పించకుండా అగ్రవర్ణాల నాయకులు బీసీలను దేశం మొత్తంలో అణగదొక్కినారన్నారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లకై జాతీయ స్థాయిలో పోరాటం చేయాలన్నారు. 14వ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే సమావేశంలో కూడా వీళ్లు అదే మోసాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆ సభను బహిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలసాని శ్రీనివాస్ గౌడ్, టీ.సురేష్, ఒల్లాల నర్సగౌడ్, కోడి జుట్టు రాజన్న, పిల్లి మల్లయ్య, మూల భాస్కర్‌గౌడ్, ఎంబడి సత్తన్న, లెక్కల మల్లయ్య పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు భయలుధేరిన పద్మశాలీలు

నవతెలంగాణ-భీమార

ఆత్మగౌరవ నినాదంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలీ కులస్థుల ఆత్మగౌరవ సాధననే లక్ష్యంతో చలో కొరుట్ల యుద్ధ భేరికి భారీగా తరలి వెళ్ళారు. ఆదివారం కొరుట్లలో పద్మశాలీల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా నిర్వహించిన ఈ సభకు సుమారు లక్ష మందితో తమ అస్తిత్వాన్ని చాటి చెప్పలనే లక్ష్యంతో పద్మశాలీ సోదరులు కదం తొక్కారు. దీంతో భీమారం మండల నుంచి సుమారు 150 మందితో చలో కొరుట్ల భయలుదేరారు. రాష్ట్రంలో ప్రత్యేక అస్థిత్వం కలిగి, అనాదిగా వస్తున్న వస్త్రోత్పత్తితో పాటు అనేక రంగంలో పద్మశాలీల సృజనాత్మకతకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్నప్పటికీ రాజకీయ రంగంలో తమదైన స్వరం వినిపించేందుకు రాజ్యాధికార సాధన కోసం ప్రతీ గడప నుంచి తరలి వెళ్ళాలని కంకనబద్దులై తరలి వెళ్ళారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవిడపు వేంకటేశం, అధ్యక్షులు గుడిమల్ల వెంటేశం, బాసాని పోశం, బండి తిరుపతి, ఉపాధ్యక్షుడు గుడిమల్ల నరహరి, సెక్రెటరీ బండి శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు మధు, సత్యనారాయణ, సమ్మయ్య శ్రీనివాస్ గౌరయ్య పాల్గొన్నారు.

తపస్ మహాధర్నా పోస్టర్‌ల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈనెల 19న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని తపస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సునీల్ చవాన్ అన్నారు. ఈ సందర్భంగా ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ని జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సునీల్ చవాన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ జాగరణలో భాగంగా తపస్ ఆధ్వర్యంలో ఈనెల 19న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులందరు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయినందున ఇక ఉద్యమలే శరణ్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపికృష్ణ, జిల్లా నాయకులు బచ్చువార్ నారాయణ, బత్తుల గంగాధర్, చంద్రశేఖర్ ముండే, శ్రీనివాస్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఎంపీ దిష్టిబొమ్మ దహనం చేయడం సిగ్గు చేటు

నవతెలంగాణ-నార్నూర్

ఎంపీ సోయం బాపురావ్ దిష్టి బొమ్మను జిల్లా కేంద్రంలో దహనం చేయడం సమాజానికి సిగ్గు చేటని ఖైర్‌డాట్వా రాయి సెంటర్ సార్మెడి మడావి తుకారాం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కుమురం భీం భవనంలో ఆదివాసీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొడప సోనేరావుపై మహిళలను పెట్టి దాడి చేయించిన దుండగులను యావత్ ఆదివాసీ సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అదివాసీ సమాజంలో ఉన్న రాయిసెంటర్ వ్యవస్థ గ్రామపటేల్ వ్యవస్థలో కూర్చొని చర్చ చేయాల్సి ఉంటుందని అన్నారు. కానీ ప్రత్యక్షంగా దాడి చేయడం సరికాదన్నారు. సమావేశంలో మరప్ప జైవంత్, సోయం దేవ్‌శావ్, పెందోర్ బాలాజీ, మరప జాకు, పెందోర్ కృష్ణ, అదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పెందోర్ దాదిరావు, పెందోర్ దీపక్, జై భారత్ టీం సభ్యులు నగేష్, అదివాసీ విద్యార్థి సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-కడెం

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్దురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిన్ రాజవ్వ(80) ఆదివారం ఉదయం 4:30 గంటలకు కాలకృత్యాలకు కోసం లేచి ఇంటి పక్కన బావి వద్దకి వెళ్లి నీటిని తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. మృతురాలి కొడుకు వెంకట్ రాములు ఫిర్యాదు మేరకు కడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై భీంరావు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తాంసి

మండలంలోని గోట్కురి గ్రామానికి చెందిన తబలా కళాకారుడు కుంటాల నారాయణ ఇటీవల గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని ఆదివారం నేరడిగొండ జెడ్పీటీసీ అనీల్ జాదవ్ మృతుని చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ పెద్ద దిక్కును కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. అనంతరం గ్రామ యువకులతో సమావేశమై పార్టీ పరిస్థితులను చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు పర్యాయాలుగా మండల యువకులతో మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. నాపై ఉన్న అభిమానంతో గ్రామానికి చెందిన ఇంత మంది యువకులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల్‌గౌడ్, అఫ్రోజ్, రజినీకాంత్ రెడ్డి, షరీఫ్, స్వామి, అశోక్, గ్రామ యువకులు ఉన్నారు.

బోథ్ : మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన పిడుగు గంగాధర్ అమ్మ పిడుగు చిన్నమ్మా ఇటీవల అనారోగ్యం మరణించారు. విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు అనిల్ జాధవ్ కుటంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా గడ్పెందే అడెల్లు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకోని వారిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు గడ్డం దివాకరరెడ్డి, బద్దం రాజారెడ్డి, గూడూరు రమణ, డా.,స్వామి, డా.,జహీర్, కొట్టాల సంతోష్, బద్దం రమణ రెడ్డి, ఆశన్న, వినోద్ కుమార్, రాములు, దేవేంధర్‌రెడ్డి, సుజిల్, కైలాష్, అనిల్ అన్న యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్లకు బయలుదేరిన పద్మశాలి సంఘం సభ్యులు



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల, బోరిగాం, తదితర గ్రామాల నుంచి ఆదివారం పద్మశాలి సంఘం సభ్యులు కోరుట్లకు బయలు దేరారు. చలో కోరుట్ల పద్మశాలి రాజకీయ యుద్ధభేరి కార్యక్రమానికి ప్రత్యేక బస్సులలో వెళ్లారు. కోరుట్లకు వెళ్లిన వారిలో పెండెల సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, జి.పోశెట్టి, శంకర్, నవీన్, రంజిత్, జి.రాందాస్, సర్వేష్, నవీన్, గంగాధర్, పెండెల ప్రసాద్, వెంకటి, చిన్నయ్య దాసరి భీముడు, శంకర్ ఉన్నారు.

బాసర : కోరుట్లలో తలపెట్టిన పద్మశాలి ఆత్మగౌరవ సభకు ఆదివారం మండల కేంద్రం నుంచి పెద్ద సంఖ్యలో పద్మశాలీయులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వీరికి సర్పంచ్ లక్ష్మణరావు సంఘీభావం తెలుపుతూ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘ సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో తొమ్మిది శాతం జనాభ కలిగి ఉన్న శాసనసభలో ప్రాతినిధ్యం లేకపోవడంపై సంఘటితంగా పోరాడేందుకు ఆత్మగౌరవ సభ ముఖ్య ఉద్దేశమని జిల్లా పద్మశాలి ప్రధాన కార్యదర్శి కే గంగాధర్ అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సోమవారం 33కేవీ బేల ఫీడర్ నిర్మాణ పని కారణంగా ప్రక్కనగల బంగారు గూడ ఫీడర్ లైన్ బంద్ చేయటం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్ తిరుపతిరెడ్డి తెలిపారు. బంగారు గూడ, పిప్పల్‌ధరి, అంకోలి, సాత్నాల సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. సబ్ స్టేషన్ల పరిధిలోని వినియోగదారులందరు సహకరించాలని ఏఈ కోరారు.

కనక లక్కేరావు మృతి పార్టీకి తిరనిలోటు

నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మెన్ కనక లక్కేరావు ఆకస్మిక మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కనక లక్కేరావు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ గుండె పోటుతో మృతి చెందిన విషయం అందరికి తెలిసిందేనని అన్నారు. కాగా ఆదివారం స్థానిక కేబి ప్రాంగణంలో పీఎంఆర్సీ భవనంలో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో పాటు ఎమ్మెల్యే జోగు రామన్న, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్, మాజీ ఎంపీ నగేష్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, ఆయా పార్టీల నాయకులు, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మౌనం పాటించారు.



అందని తడి ఎండిన నారుమడి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

సదర్‌మాట్ నీటి విడుదలలో ఏర్పడిన జాప్యంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. జులై మాసంలో మొదట కురిసిన జల్లులకు రైతులు నారుమడి విత్తుకున్నారు. అదే నెల చివరి వారంలో కురిసిన భారీ వర్షాలకు సదర్‌మాట్ కాలువకు గండ్లు పడ్డాయి. గండ్ల మరమ్మతు పనుల్లో అధికారులు తీవ్ర జాప్యం చేస్తుండటంతో ఖరీఫ్ పంట సమయం దాటిపోతుంది. గండ్లు పూడ్చని కారణంగా సదర్‌మాట్ ఆయకట్టుకు ఇంతవరకు నీరు విడుదల కాలేదు. ఇదే సమయంలో పదిరోజులుగా వర్షాలు పడక నేలలో తేమతగ్గి నారుమళ్లు ఎండి పోతున్నాయి. రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాల్సిన గండ్ల మరమ్మతు పనులు నీటి పారుదల శాఖాధికారుల నిర్లక్ష్యం వల్ల సకాలంలో పూర్తికావడం లేదు. ఖరీఫ్

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

నష్టపోయే పరిస్థితి నెలకొన్నా ఎమ్మెల్యే రేఖానాయక్ పట్టించుకోక పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారుల తీరువల్ల ఈసారి ఖరీఫ్ వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. సదర్‌మాట్‌లో పుష్కలంగా నీరుఉండి కూడా పంటసాగు చేసుకునే అవకాశం లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడెకరాల నారు ఎండిపోయింది

రైతు దాసరి చిన్నయ్య, ఖానాపూర్



నాకున్న ఎకరం సొంత పొలంతో పాటు కౌలుకు తీసుకున్న రెండు ఎకరాల పొలంలో సాగు కోసం 20 రోజుల కింద నారుమడిలో వరి విత్తుకున్నాము. 10 రోజుల కింద వరకు కురిసిన వర్షాలకు నారు పచ్చగా బాగానే ఉండే. వారం రోజులుగా ఎండలకు నారు ఎండి పోయింది. ఆయకట్టుకు నీరు విడుదల చేయక నారుమడికి నీటి తడి అందించే అవకాశం లేదు. ఇప్పుడు సదర్‌మాట్ నీరు విడుదల చేసినా నాలాంటి రైతులకు ఉపయోగం లేదు.

ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని టీయూటీఎఫ్ భవనంలో పలు సంఘాల నాయకులు కలిసి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూటీఎఫ్, టీపీయూఎస్, డీటీఎఫ్, ఎస్టీయూ, టీఆర్టీఎఫ్, టీఆర్టీఎఫ్, టీఎస్పిటీఏ, ఎస్జీటీయూ, టీఎస్టీటీఈ తదితర సంఘాలు ఏకమై ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నోటిఫికేషన్‌లో పేర్కొన్న దానికి విరుద్ధంగా స్పోర్ట్స్ స్కూల్లో నియమించబడిన అక్రమ నియమకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 విద్యా సంవత్సరంలో సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ప్రభుత్వమిచ్చిన నిబంధనలకు విరుద్ధంగా నియమించిన అన్ని కేడర్ల బదిలీలను రద్దు చేయాలన్నారు. సర్దుబాటు ఉత్తర్వుల ప్రకారం కేటాయించబడిన పాఠశాలలకు వెళ్లని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి వెలువడే అన్ని రకాల ఉత్తర్వులను అన్ని సంఘాల బాధ్యులకు అందజేయాలని అన్నారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లా విద్యాశాఖ అధికారి అన్ని సంఘాల బాధ్యులకు



సమయం కేటాయించాలని అన్నారు. ఈ సమస్యలు వారం రోజులలో పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆదిలాబాద్ ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో దశలవారీగా పోరాట కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దళారులదే రాజ్యం



నవతెలంగాణ-అదిలాబాద్ రూరల్

రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారామిస్తే దళారుల రాజ్యం వస్తుందని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి ఆరోపించారు. అధికారంలోకి వస్తే ధరణి రద్దు చేస్తామన్న కాంగ్రెస్ వ్యాఖ్యాలను తప్పుపట్టారు. ఆదివారం అదిలాబాద్ మండలంలోని ఆదివారం పొచ్చెర గ్రామంలో ఏర్పాటు చేసిన చేరికల సభ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామంలో కాంగ్రెస్ బీజేపీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో స్వచ్ఛందంగా చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణి వల్ల రిజిస్ట్రేషన్లు సులభంతరం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో భూములు పత్రాలు పహాణిల కోసం లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. రైతులు దళారులను ఆచరించాల్సిన అవసరం వచ్చేదని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రతి ఎకరానికి రెండు విడతలుగా పదివేల రూపాయలను పెట్టుబడి సాయం కింద అందిస్తున్నామని అన్నారు. రైతు బీమా రుణమాఫీ ఇచ్చి ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, బీసీలకు ఆర్థిక చేయూత, దళితబంధు అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి ప్రజలను ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదిలాబాద్ ఎంపీపీ గంద్రత్ రమేష్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్, కుమ్ర రాజు, ఉపసర్పంచ్ రామన్న, అల్లూరి రమేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఆశన్న, గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు కేవలం నినాదాలకే పరిమితం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో ఇతర పార్టీలు ఇచ్చే నినాదాలను బీఆర్ఎస్ ప్రభుత్వం విధానాలుగా మార్చి చేతల్లో చూపిస్తోందని, ప్రతిపక్షాలు కేవలం నినాదాలకే పరిమితమైన వేళ అభివృద్ధిని చేసి చూపిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. పట్టణంలోని ధోబి కాలనీలో పదహారు లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన నవ చైతన్య యూత్ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే లాంచనంగా ప్రారంభించారు. ముందుగా కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక యువకులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సీతా రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపి వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలించిన ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తే తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ సమగ్ర అభ్యున్నతే పరమావధిగా దూసుకెళ్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులు, ఇంటింటికి అందుతున్న సంక్షేమ పథకాల ఫలాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని, విశిష్టతను కాపాడుతూ భావి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఆలయాల నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. ఇతర పార్టీల నాయకులు కేవలం ఎన్నికల సమయంలో వాడుకునే నినాదాలను విధానాలుగా మలుచుకుని అందరి సంక్షేమానికి పాటు పడుతున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, కౌన్సిలర్ భరత్, అధికార ప్రతినిధి గంగారెడ్డి, డీవీటీ రాజు, దత్తు, అశోక్ స్వామి, నాయకులు మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా రాథోడ్ గంగాధర్

నవతెలంగాణ-సిరికొండ

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా రాథోడ్ గంగాధర్ నియామకం అయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేస్తూ, నాపై నమ్మకంతో ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పదవి ఇచ్చిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు మండల నాయకులు అతనికి అభినందనలు తెలిపారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకు ఉద్యమం

నవతెలంగాణ-బోథ్

రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 28వ రోజుకు చేరింది. రిలే నిరాహార దీక్షలో గ్రామస్తులు కూర్చున్నారు. అలాగే నిరసన వ్యక్తం చేస్తూ వంటవార్పులు నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటు అయ్యేంతవరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగుతాయని ప్రభుత్వానికి హెచ్చరించారు .అలాగే బోథ్ మండల కేంద్రం నుంచి తరలిపోయిన కార్యాలయాలు వెంటనే తరలి రావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రెవెన్యూ సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఐకమత్యంగా ఉంటూ ఆర్థిక ప్రగతి సాధించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఐకమత్యంగా ఉంటూ ఆర్థిక ప్రగతిని సాధించాలని, ఆ దిశగా కార్యాచరణ రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమావేశంలో భాగంగా మున్నూరుకాపు కులస్తులు నడుపుతున్న వ్యాపారాలు, ఒకరికొకరు సహాయం ఇచ్చిపుచ్చుకుంటే సాధించే విజయాలు, భవిష్యత్ కార్యాచరణపై వక్తలు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సమావేశాల్లో భాగంగా ఇరవైవ సమావేశాన్ని పట్టణంలో నిర్వహించగా తమ తమ వ్యాపారాలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మున్నూరుకాపు కుల సోదరులు నిర్వహిస్తున్న వ్యాపారాల వివరాలను ఒక చోట చేర్చడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. అన్ని రంగాల్లో ప్రస్తుతం కులస్తులు రాణిస్తున్నారని, ఐక్యంగా ఉండి ఆర్థికంగా నిలదొక్కుకుంటే మరింత పురోగతి సాధించవచ్చని అన్నారు. ఇటువంటి సమావేశాల నిర్వహణ పట్ల అభినందనలు తెలిపిన ఆయన భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్, రిమ్స్ సూపరింటెండెంట్ అశోక్, ప్రముఖ వైద్యులు అభిజిత్, సాయిని రవికుమార్, జక్కుల సత్యనారాయణ, బేర సతీష్, జక్కుల శ్రీకాంత్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ



నవతెలంగాణ-ఇచ్చోడ

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం మండల కేంద్రంలో తిరంగా ర్యాలీని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ హాజరై మాట్లాడుతూ దేశంకోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులను, సైనికులను స్మరించుకోవడం చాలా అవసరం ఉందన్నారు, వారి త్యాగాలను, వారి స్ఫూర్తిని ప్రతి ఒక్కరికీ తెలిసేలా గత సంవత్సరం ప్రధాని నరేంద్ర మోదీ అజాది కా అమృత్ మహోత్సవం పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించి దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, మండల అధ్యక్షులు కేంద్రే నారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, మాధవరావు ఆమ్టే, కదం బబారావు పటేల్, మండల ప్రధాన కార్యదర్శి టేహరే రమేష్ ఉపాధ్యక్షులు పవర్ సంతోష్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు దామోదర్, యువ మోర్చా మండల అధ్యక్షులు అనిల్ ముర్కుటే, ఓబిసి మోర్చ మండల అధ్యక్షులు జాదవ్ రాము, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ మామిడి భరత్ శక్తి ముందే సాయినాథ, గైక్వాడ్ దశరథ్, కార్యకర్తలు సాయి ప్రసాద్, దినేష్, అర్జున్, రాజు, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

బాసర : ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ఆదివారం హర్ ఘర్ తీరంగా ర్యాలీ నిర్వహించారు. శాతవాహన క్రీడా ప్రాంగణం నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీని వైస్ ఛాన్సలర్ వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇండ్లు, కార్యాలయలపై జాతీయ జెండాను ఎగరవేసి జాతీయ సమైక్యతను చాటి చెప్పాలని కోరారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, అధ్యాపకులు యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అదిలాబాద్‌టౌన్ : నా దేశం నా మట్టి కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి వినాయక్ చౌక్ వరకు విద్యార్థులతో కలిసి దేశభక్తిని చాటేలా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ మాట్లాడుతూ దేశం కోసం అమరులైన వీర జవాన్లను, త్యాగ మూర్తులను గుర్తు చేసుకొని స్మరించుకోవాలని అనే ఉద్దేశంతో నా దేశం నా మట్టి కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. భారతదేశం కోసం భారతదేశ ప్రజలకోసం అమరులైన వీరుల సేవలు ఎనలేనివని అన్నారు. ఈ ర్యాలీలో నాయకులు ఆకుల ప్రవీణ్, జోగు రవి, సోమ రవి, రఘుపతి, మయూర్ చంద్ర, శివ, సచిన్, ముకుందరావు, సుభాష్, సాయి, శివ నగేష్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తా

నవతెలంగాణ-బాసర



ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని కిరణ్ ఫౌండేషన్ చైర్మెన్ డాక్టర్ కిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని బీదరెల్లి, ఓనీ, కౌటా, కిర్గుల్(బి) మైలాపూర్ గ్రామాలలో పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న, పంట చేనులను, రహదారులను పరిశీలించారు. వర్షాలకు రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, రైతులకు పంట నష్టం సంభవించిందని, ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం అందించాలని అన్నారు. వీరి వెంట ఆయా గ్రామాల ప్రజలు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-లోకేశ్వరం

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోతరాజు శ్రీనివాస్ (38) శనివారం సాయంత్రం కాలకృత్యాలకు వెళ్లి తిరిగి రాలేదు. ఉదయం చెరువు గట్టుపైన చెప్పులు చూసి గాలించగా మృతదేహం లభ్యమైంది. ప్రమాదవశాత్తు కాలు జారీ పడి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుని అన్న పోతరాజు భోజన్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సిలిండర్ రూ.500లకు అందిస్తాం



నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500లకు సిలిండర్ అందిస్తామని బోథ్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ వన్నెల అశోక్ అన్నారు. ఆదివారం మండలంలోని సిరిచెల్మ గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ రైతు డిక్లరేషన్, సరూర్‌నగర్ యూత్ డిక్లరేషన్ గురించి, ప్రతి గ్రామంలో వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే చేపట్టే పలు అభివృద్ధి పథకాలను ప్రతి ఒక్కరికి వివరించారు. అలాగే రాబోవు రోజుల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్, సుదర్శన్‌గౌడ్, లచ్చన్న, రవి, పిట్ల కృష్ణా, శ్రీధర్, గుండయ్య, ప్రవీణ్‌రెడ్డి, హనుమాండ్లు, కిరణ్‌రెడ్డి, రాజు, భూమన్న పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభావు సాఠే జయంతి

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని జున్ని గ్రామంలో ఆదివారం సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠే 104వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధవ్ ముఖ్యతిథిగా పాల్గొని మహనీయుని విగ్రహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ మాధవ్, సంఘం నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులు అన్నాభావు సాఠే దళితుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని, ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అన్నాబావు సాఠే అడుగుజాడల్లో యువత నడవాలని, వారి సేవలను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు నానాజీ, మోతీరాం, పిరాజి పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నిక

నవతెలంగాణ-తాండూర్

మండల ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం తాపీ సంఘం భవన్‌లో ఎన్నుకున్నారు. కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నల్ల సతీష్ ముఖ్యఅతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆకుల వేణు, ప్రధాన కార్యదర్శిగా కాంపెల్లి విజయ్, కోశాధికారిగా మడుపు విక్రమ్, గౌరవ అధ్యక్షులుగా కుంభాల రాజేష్, గౌరవ సలహాదారులుగా కాంపెల్లి శంకర్ బాబు, ఆకునూరి రాజ కుమార్, ధర్మేంధర్, పట్నం చక్రధర్, ఉపాధ్యక్షులుగా మల్టీ వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా కోనేరి శంకర్, అడిచెర్ల మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నస్పూరి సందీప్, కార్యవర్గ సభ్యులుగా త్రివి మోహన్, గజేల్లి రఘు, చిన్న ప్రశాంత్, మెరుగు పోశం, లను ఎన్నుకున్నారు ఈ కమిటీ కాల పరిమితి మూడు సంవత్సరాలు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటోగ్రాఫర్స్ ప్రశాంత్, ఫోకస్ ప్రేమ్, దుంద్ర మహేందర్, దొంగల నాగరాజు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

సోమవారం 14 ఆగస్టు 2023

17న జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభను ఈ నెల 17న ఆసిఫాబాద్‌లో నిర్వహించనున్నట్లు యూనియన్ బాధ్యులు వెలిశాల కృష్ణమాచారి కోరారు. ఆదివారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ ఫంక్షన్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి మధు హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కర్‌లు కన్నుబాయి, అన్నుబాయి, సుల్తానా పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఈ నెల 17న జిల్లాకేంద్రంలో తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డెయిలీ వైజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు కృష్ణమాచారి అన్నారు. మండలంలోని ఎల్లూరు గ్రామంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలోని మైనార్టీ ఫంక్షన్‌హాలులో సీఐటీయూ జిల్లా కమిటీ పిలుపు మేరకు మహాసభలను జయప్రదం చేయాలని, ఔట్‌సోర్సింగ్ వర్కర్లు పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల వర్కర్లు లక్ష్మణ్, సురేష్, కిష్టయ్య అమృత పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుని నియామకం

నవతెలంగాణ-జన్నారం

ఎన్‌ఎస్‌యూఐ ఖానాపూర్ నియోజకవర్గ, అధ్యక్షుడిగా జన్నారం మండలానికి చాందిన కెమెరా రాకేష్‌ని నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ ఆదివారం ఉత్తర్వులు జారి చేసినట్టు రాష్ట్ర కార్యదర్శి సోహల్స ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతు విద్యార్థుల హక్కులకై పోరాటం చేస్తుందన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పాలమూరు వెంకట్‌కు రాష్ట్ర కార్యదర్శి సోహెల్ షాకు కృతజ్ఞతలు తెలిపారు.

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-హాజీపూర్

శ్రీహర్ష డిగ్రీ కాలేజీలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీహర్ష విద్యాసంస్థల అధినేత మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్ ఆయన మిత్ర బృందం గొంగోళ్ళ శంకర్, నల్ల శంకర్, జగ్గారి సంజీవ్, ఖాజా మియ్యాల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సీనియర్ కార్డియాలజిస్ట్ కస్తూరి శ్రీధర్, కిమ్స్, సన్ షైన్, మెడిలైఫ్ హాస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ మెగా వైద్య శిబిరానికి వెయ్యి మందికిపైగా హాజరై వైద్య పరీక్షలు చేయించు కున్నారు. కార్డియాలజీ, ఆర్థో పెడిక్, గైనకాలజీ, న్యూరాలజీ, జనరల్ మెడిసిన్ విభాగాల్లో రోగులు సంబంధిత డాక్టర్ల ద్వారా చికిత్స చేయించు కున్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే దివాకర్‌రావులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్గనైజర్ అత్తే సరోజ, కౌన్సిలర్ల మినాజ్, గాదే సత్యం, హరికృష్ణ, రవీందర్ రావు, రాజు, తాజొద్దిన్ పాల్గొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించి వారి సర్వీస్ రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో రెండవ ఏఎన్‌ఎంలు ఎన్నో సేవలు అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వారి సేవలు గుర్తించి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇచ్చిన నోటిఫికేషన్ విత్ డ్రా చేసుకోవాలన్నారు. లేనట్లయితే ఈ నెల 16వ తేదీ నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండవ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.సంతోషి, కోశాధికారి సునీత పాల్గొన్నారు.

బెల్లంపల్లి ఏరియాలో ఉత్తమ ఉద్యోగుల ఎంపిక

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్టు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి.రవిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బెస్ట్ సింగరేణియన్‌గా రామగిరి శ్రీనివాస్, ఫోర్‌మెన్ ఐసీ(ఎలక్ట్రికల్), గోలేటి సీహెచ్‌పీ, ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులు దాసరి భిక్షపతి, జనరల్ మజ్దూర్(ఖైరిగూడ ఓసీ), రాందాత్రి రమేష్, హెడ్ ఓర్‌మెన్(ఖైరిగూడ ఓసీ), ఆరబెండాల నరేష్, హెడ్ ఫోర్‌మెన్, బీసీఏ ఓసీటు ఎక్స్టెన్, లక్కిరెడ్డి శ్రీపాల్, సర్వే మజ్దూర్, ఈపీఏ ఓసీటు ఎక్స్టెన్, దుర్గం బాపు, లారీ ముకద్దమ్(గోలేటి సీహెచ్‌పీ), బెస్ట్ సింగరేణియన్‌ను ఈ నెల 15వ తేదీన కొత్తగూడెంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సన్మానించనుండగా బెల్లంపల్లి ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులను గోలేటి జీఎం కార్యాలయంలో జరిగే వేడుకల్లో సన్మానించి జ్ఞాపికలను అందజేయనున్నట్టు జీఎం తెలిపారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అక్టోబర్ నెలలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే ఐదో డీటీఎఫ్ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆదివారం కాగజ్‌నగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఈ మహాసభలకు అఖిల భారత విద్యా హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ హరగోపాల్, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారని, ఈ మహాసభలలో విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యారంగంలో వచ్చిన మార్పులు, సిలబస్‌లో చేసిన మార్పుల గురించి చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ దుర్గం విస్తారు, కో కన్వీనర్ పి నాందేవ్, శంకర్, ప్రభాకర్, మధుసూదన్ పాల్గొన్నారు.



కేజీబీవీ నియామకాల్లో గందరగోళం

- సెలవు రోజుల్లో ఉత్తర్వులపై అభ్యర్థుల ఆవేదన
- రోస్టర్ పాయింట్ విధానంపై ఉద్యోగార్థుల తికమక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టులకు సంబంధించి ఉపాధ్యాయుల నియామక ప్రక్రియతో గందరగోళనం నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నియామక ప్రక్రియను వేగంగా పూర్తి చేయడంపై దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

జిల్లాలో 95 పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం...

జిల్లాలో వివిధ సబ్జెక్టులకు సంబంధించి 95 పోస్టులకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానించగా సుమారు 800 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే బీసీఏలో అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో కేవలం 87 పోస్టులను మాత్రమే భర్తీ చేసి 8 పోస్టులు మిగిలిపోయినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకొని పరీక్ష రాశారు. పరీక్ష ఫలితాలు వచ్చి 1:3 లిస్ట్ పెట్టడం దానిలో నుండి 1:1 లిస్టు పెట్టడం నియామక ప్రక్రియ అంత మూడు రోజుల్లో జరిగిపోగా ఆదివారం ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు జిల్లా విద్యాధికారి అశోక్ చేతుల మీదుగా అందజేశారు.

రోస్టర్ పాయింట్ విధానంపై ఉద్యోగార్థుల తికమక

వివిధ సబ్జెక్టులకు సంబంధించిన నియామక ప్రక్రియలు అధికారులు రోస్టర్ విధానాన్ని అమలు చేశారు. అయితే ప్రభుత్వ విధానాల ప్రకారం అనుసరించాల్సిన రోస్టర్ విధానం అమలు చేయకపోవడంపై అభ్యర్థులు తికమకపడ్డారు. సబ్జెక్టు వారీగా 4 పోస్టులు ఉంటే రెండు జనరల్ విభాగానికి, ఒకటి బీసీ విభాగానికి, ఒకటి ఎస్సీ విభాగానికి కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మొదటి రోస్టర్ జనరల్ కాగా, రెండవ రోస్టర్ ఎస్సీ మహిళకు కేటాయించినదిగా ఉండగా, మూడు, నాలుగు రోస్టర్లు జనరల్‌గా ఉన్నాయి. ఇది చూసి అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు.

సెలవు రోజుల్లో నియామకాలపై నిరుద్యోగుల్లో ఆందోళన..

ఇప్పటికే రాష్ట్రంలో నిర్వహించిన వివిధ పోటీ పరీక్షలు అబాసుపాలు కాగా తాజాగా కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చేపట్టిన నియామకాలు కూడా అదే కోవకు చేరాయి. అధికారులు ఆదరా బాదరాగా అర్ధరాత్రి ఫోన్ చేసి నియామకాలు చేపట్టడం అది కూడా సెలవు రోజుల్లో చేపట్టడంపై నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది.

ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా భర్తీ ప్రక్రియ

జిల్లా విద్యాశాఖాధికారి అశోక్

కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 95 పోస్టులు భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసి ఉన్నతాధికారుల ఆదేశాల కనుగుణంగా భర్తీ ప్రక్రియ చేపట్టాం. రోస్టర్ విధానంలో ప్రత్యేక పద్ధతి అనుసరించాల్సి ఉంటుంది. అదే విధానాన్ని ఇక్కడ కూడా అనుసరించాము. నిబంధనలకు అనుగుణంగా భర్తీ ప్రక్రియ చేపట్టాము.

అధికారులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు

ప్రేమల, కేజీబీవీ అభ్యర్థిని

నేను ఎస్టీ కులానికి చెంది ఉన్నాను. రోస్టర్ నియామక విధానంలో కనీసం ఎటువంటి సూచనలు కూడా అధికారులు చేయలేదు. నాలుగు కామర్స్ పోస్టులలో ఎస్టీకి ఒకటి కూడా కేటాయించకపోవడంతో నేను నష్టపోవాల్సి వచ్చింది. మూడో ర్యాంకు సాధించినప్పటికీ నాకు అవకాశం కల్పించలేదు. ఇదే విషయం మొదట్లోనే తెలియజేస్తే అనవసరంగా డబ్బులు వృధా చేసి పరీక్ష రాసేదాన్ని కాదు. అధికారులు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తూ భర్తీ ప్రక్రియ చేపట్టారు.

పశుమిత్రుల సేవలు ప్రభుత్వం గుర్తించాలి



- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మూగజీవాలకు పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో సేవలందిస్తున్న పశు మిత్రలను ప్రభుత్వం గుర్తించాలని సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశు మిత్రులకు నిర్ణీతవేతనాలు, గుర్తింపు కార్డులు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలన్నారు. మూగజీవులకు వైద్య సేవలు వ్యాధుల నివారణకై టీకాలు వేస్తూ, పశువుల ఆరోగ్యాలను కాపాడుతున్నరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు నిర్ణయించి ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా వేతనాలు నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పశుమిత్రలకు గుర్తింపు కార్డులు, యూనిఫామ్, ఆరోగ్య భీమా సౌకర్యం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు, పశుమిత్రల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇందు, శ్రీలత, భారతి, రాజేశ్వరి, స్వాతి, చంద్రకళ పాల్గొన్నారు.

నూతన అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దు చేయకపోతే ఆందోళన

- టీఏజీఎస్ రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన నూతన అటవీ పరిరక్షణ చట్టాన్ని రద్దు చేయని పక్షంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల తొమ్మిదో తేదీ నుండి చేపడుతున్న కార్యక్రమాల ముగింపు సందర్భంగా ఆదివారం స్థానిక బాలభారతి ఉన్నత పాఠశాలలో సభ నిర్వహించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ ఆదివాసీ భూములపై కన్నేసిన పాలకవర్గాలు చట్టాలను మార్పు చేయడం ద్వారా ఆ భూములను కాజేసే ప్రయత్నాలు చేపడుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా ఇన్నాళ్లుగా అమలవుతున్న పీసా, 1/70 చట్టాలు కూడా నిర్వీర్యం అవుతాయని అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు పాలకులు ముందుకు రావడం లేదని అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం పోరాటాల ద్వారానే రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిస్తోందని అన్నారు. ఇది ఎన్నికల జిమ్మిక్కు కాకుండా ప్రతీ ఒక్కరికి పట్టాలివ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు మాలాశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నేర్పల్లి అశోక్, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, దిగిడ బక్కన్న, సహాయ కార్యదర్శి ఎస్ దామోదర్, జిల్లా కమిటీ సభ్యులు డి లక్ష్మి, ఎస్ లక్ష్మి, నాయకులు శ్యాగం కమల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ముంజం ఆనంద్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, దుర్గం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదివాసులకు అండగా ఉంటాం



నవతెలంగాణ-దండేపల్లి

- శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి

రామగుండం పోలీస్ కమిషనర్ పరిధిలోని ఆదివాసులకు పోలీసులు ఎప్పుడు తోడుగా ఉంటారని పోలీసులకు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమ రాజేశ్వరి అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల వద్ద పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేశ్వరికి గిరిజన సాంప్రదాయాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు ఆమె తెలిపారు. మండలంలోని సుమారు 30 గిరిజన గ్రామాలకు చెందిన ఆదివాసి గిరిజనులు వైద్య శిబిరాన్ని ఉపయోగించుకొని ఉచితంగా వైద్య పరీక్షలు మందులు తీసుకున్నారని ఆమె తెలిపారు. గిరిజనులకు పోలీస్ చట్టాల గురించి వివరంగా తెలియజేశారు. ప్రతి వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని ఆమె అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని గిరిజనులకు ఉచితంగా దరఖాస్తులు చేసి డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించేందుకు కృషి చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ తమ ధ్యేయమని ఆమె అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనుమాదాస్పద వ్యక్తులు తమ గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. సుమారు 1100 మంది గిరిజనులు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకున్నారని ఆమె పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమానికి తరలివచ్చిన గిరిజనులకు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, అడిషనల్ కలెక్టర్ రాహుల్, ఏ ఆర్ అడిషనల్ డీజీపీ రియాజుల్ హక్, ఏసీపీ తిరుపతిరెడ్డి, లక్షెట్టిపేట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణ, దండేపల్లి ఎస్సై ప్రసాద్, డాక్టర్ల బృందం సభ్యులు, చేతన్, శ్రీనివాస్, శ్రీధర్, ప్రసన్న, శ్రీనివాస్, జయ భారతి, శ్రీధర్, స్వప్నిక, గణపతి, మెడికల్ ఆఫీసర్లు సతీష్, అభిజ్ఞ, ప్రత్యూష, రాజు పాల్గొన్నారు.

పథకాల పేరుతో ప్రజలను వంచిస్తున్నారు

- మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావు

నవతెలంగాణ-హాజీపూర్

ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో సీఎం కేసీఆర్ వివిధ పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మొదట గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున రైతు రుణమాఫీ చేపడుతున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. 2014 ఎన్నికల్లో రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి రూ.లక్ష రుణం ఉన్న వారికి ఏడాదికి రూ.25 వేలు మాఫీ అంటూ బ్యాంకులకు చెల్లిస్తే అసలు మాఫీ కాగా వడ్డీ అలాగే ఉండిపోయిందన్నారు. 2018 ఎన్నికల్లో మళ్లీ రుణమాఫీ అని చెప్పి ఈ నాలుగేండ్లలో ఒక్క రూపాయి కూడా మాఫీ చేయకుండా త్వరలో ఎన్నికలు ఉన్నందున రుణమాఫీ ప్రకటించారని ప్రభుత్వం చేసే రుణమాఫీ వడ్డీకే సరి పోతుందని అసలు అప్పు రైతుల పేరిట బ్యాంకులో అలాగే ఉం టుందని విమర్శించారు. వైఎస్ఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.లక్ష రుణమాఫీని ఏకకాలంలో మాఫీ చేయడం వల్ల రుణ విముక్తులై కొత్త పంటలు రుణాలు పొందేం దుకు వెసులుబాటు కలిగిందనీ పేర్కొన్నారు. ప్రస్తుతం కేసీఆర్ చేసే రుణమాఫీ వల్ల రైతులకు పాత బాకీలు తీరకపోగా కొత్తగా బ్యాంకులు, వ్యవసాయ పరపతి సంఘాలు రుణాలు ఇవ్వడం లేదన్నారు. రైతులు వడ్డీ వ్యాపారులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్రూం ఇస్తామని చెప్పి 9 సంవత్సరాలు గడిచినా హైదాబాద్‌లో తప్ప ఎక్కడా ఎవరికి ఇవ్వలేదన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇండ్లను పిట్టగూళ్లు, డబ్బాలు అని విమర్శించిన కేసీఆర్ తాను మంచి ఇండ్లు ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. అనంతర సొంత ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తానని చెప్పి తీరా ఇప్పుడు గృహలక్ష్మి పేరుతో రూ.3 లక్షలు ఇస్తామని చెప్పి నియోజకవర్గానికి 3 వేలు ఇండ్లు కేటాయించడం దారుణమన్నారు. జిల్లాలో 18 వేల వరకు ఇండ్లు లేని పేదలు ఉన్నారని, వారందరికి గృహలక్ష్మీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఐడీఓసీ టోర్నమెంట్ విజేత పోలీస్



నవతెలంగాణ-నస్పూర్

నిరంతర పని ఒత్తిడి, అవిశ్రాంత విధి నిర్వహణలో కలిసిపోయిన ప్రభుత్వ ఉద్యోగులకు ఉపశమనం, మానసిక ఉల్లాసం కోసం నిర్వహించిన ఐడీఓసీ టోర్నమెంట్‌లో పోలీస్ శాఖ విజేతగా నిలిచిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్ అన్నారు. ఈ నెల 12, 13 తేదీలలో జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి స్టేడియంలో నిర్వహించిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మున్సిపల్ చైర్మెన్ ప్రభాకర్‌తో కలిసి పాల్గొని, విజేతగా నిలిచిన పోలీస్‌శాఖను, రన్నర్‌గా నిలిచిన పురపాలక శాఖను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని అన్నారు. అనునిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం కోసం ప్రభుత్వ ఉద్యోగులు అహర్నిశలు విధులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇటీవల జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులలో అధికారులు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటూ విశిష్ట సేవలు అందించారని అన్నారు. మానసిక ఒత్తిడి, పని ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఈ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆంగ్ల భాషపై ప్రతి ఉపాధ్యాయుడు ప్రావీణ్యం సాధించాలని విల్ టు కెన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ శిక్షకుడు రామేశ్వర్ గౌడ్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ఉపాధ్యాయులకు 40 రోజులు ఆంగ్లభాష ప్రావీణ్యంపై నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో జిల్లావ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులకు ఆంగ్లభాషపై ప్రావీణ్యం పెంచుకోవడానికి అవసరమైన సూచనలు సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఆంగ్లభాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ఇప్పటికే ప్రతి చోట ఆంగ్ల భాష అవసరం ఏర్పడుతుందని రానున్న రోజుల్లో ఇది మరింత పెరుగుతుందన్నారు. చుట్టూ జరిగే సన్నివేశాలు ఆధారంగా విద్యార్థుల్లో కూడా ఆంగ్లభాషపై ఆసక్తి పెంచడంతోపాటు పట్టు పెంచాలన్నారు. క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ ఆంగ్లభాష నైపుణ్యాన్ని పెంచుకొని మన పాఠశాలల్లో చదువుతున్న ఉపాధ్యాయులకు విద్యార్థులకు ఆంగ్ల భాషలో బోధించాలని అన్నారు. కనీస అభ్యసన సామర్థ్యాలు ఆంగ్ల మాధ్యమంలో సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్ల భాష అనేది చాలా ముఖ్యమని ఉపాధి అవకాశాలు ఆంగ్లభాష ద్వారానే ఎక్కువగా మెరుగవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-తాండూర్

మండలంతోని మాదారం టౌన్‌షిప్‌లోని కమ్యూనిటీ హాల్లో ఆదివారం 1988-89 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దుబాయ్‌లో నివసిస్తున్న చలుమూరి సతీష్ పాత మిత్రులను ఒకే చోట కలుసుకునే విధంగా కృషి చేశారు. స్నేహితులంతా ఒక చోట కలుసుకున్నారు. వీరంతా తమ పాత జ్ఞాపకాలను నేమరు వేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో సింగరేణి ఉన్నత పాఠశాల ప్రాంగణంతో పాటు మాదారం టౌన్‌షిప్ కోలాహలంగా మారింది. మందనపు రామారావు కార్యక్రమం ఏర్పాట్లను నిర్వహించారు.

బీసీ హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రూప్నర్ రమేష్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్‌లు డిమాండ్ చేశారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో జనకాపూర్ బీసీ బాయ్స్ హాస్టల్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్ళకి నూతన పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు శ్రద్ధతో ఏకగ్రతతో చదవి దేశానికి సేవచేయలని అన్నారు. అదే విధంగా క్రీడలలో రానించాలని అన్నారు. గతంలో బీసీ హాస్టల్లకు క్రీడా పరికరాలు అందజేశామని భవిష్యత్తులో మరిన్ని అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కాంగ్రెస్ పాదయాత్ర

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని గిరిజన గ్రామాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం రెండో రోజు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ మాట్లాడుతూ రాహుల్ గాంధీ తలపెట్టిన హత్ సే హత్ జోడో యాత్రకు అనుసంధానంగా హత్ సే హత్ అభియాన్ యాత్రలో భాగంగా బెల్లంపల్లి నియోజకవర్గంలో 25 రోజులు జరిగే పాదయాత్రలో భాగంగా రెండోరోజు గట్రావ్‌పల్లి, కొత్తగూడా, జెండాగూడా, సాలెగూడా, దొడ్డిగూడ, సోనాపూర్, లక్ష్మీపూర్, కుర్రేగాడ్, వెంకటాపూర్ గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పల్లెలలు బాగుపడతాయని వివరిస్తూ జాగృత పరచినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డ శారద, ముడిమడుగు మహేందర్, నాథరీ స్వామి మండల నాయకులు ఎంపీటీసీలు భీంరావ్, పార్వతి మల్లేష్ మాజీ సర్పంచ్‌లు ప్రభాత్ రావు, జాడి శంకర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కనుకుల రాకేష్, మైనారిటీ సెల్ షాకీర్, సీనియర్ నాయకులు కనకరాజు, మడావి వెంకటేష్, జనార్ధన్‌రెడ్డి, ఖదీర్, జయరాం, అచ్యుతరావు, మెస్రం భీంరావ్, కోవ సోము పాల్గొన్నారు.